## నావికుడా? నాయకుడా?

"కొండగాలి వుండగానే పైరుగాలి సుండీ!" అని అనుకునేదో స[illegible]ము సంధ్యాకాలం అది. చిరుచలి చిట్టెండలయొక్క సమష్టి సమ పాళపు సంస్పర్శను శరీరం పులకలెత్తుతూంటే కూర్చుండి పోయాను. కొత్తపోతగట్టుయొక్క కొట్టకొసకంటా నడిచిపోయి ఆ కొట్టకొస ముక్కుదేరి రాజమహేంద్రవరంలో 'అభినవడాల్ఫిన'లా విరాజిల్లుతూ వున్నదెశ. నేను కూర్చున్నచోటికి మరోమార్గంలేదు, మరో మర్యాదలేదు. అంతా నడచిన వెనకాతలే రావలసిందే. వచ్చివచ్చి నాకంటె అంతో ఇంతో నీటికి దూరతరంగా ఉండ వలసిందే. ఆపొద్దు నేను ఆక్రమించుకువున్న హద్దు అటువంటిది. అద్దంలో ప్రతిఫలిస్తూ వున్నంత బద్ధస్థాయిని కనవచ్చింది చూస్తూన్న ప్రతీ దృశ్యమూ ఆగడియప్పుడు.

రెండుమూడు రాదారీ పడవలు ఒక తొట్టిపడవ ఆదా కాగడవేసుకుంటూవచ్చి అక్కడ చాపలెత్తుకుంటూ బొబ్బర్లంక విద్వేశ్వరాల వెంపు కాలం మరచి వెడుతూవుంటే డరోథీ తల్లి స్టీమరు కూసుకుంటూ సాయంకాలం అరు గంటలు అని జ్ఞాపకం చేస్తూవుంది నీటిమీద కుడితట్టు. ఎండతట్టు గట్టుకుచేరివున్న విశాల భూప్రదేశమ్మీద చాకిదంపతులు అరవేసిన అనేక తరహాల అసంఖ్యకపు టంగీలు, లుంగీలు, రైకలు, కోకలు, వోణీలు గోణాలు, రంగురంగుల తోరణాల్లా నేత్రపర్వం గావిస్తున్నాయి. పట్నం పరకాయిస్తే ఎత్తయిన కొబ్బరిచెట్లు. అదివర కెక్క డున్నాయో అవి. సూటిగా మేడల్తో సరిసమానంగాలేచి ఒయ్యారపు తలూపుల్నే కాయల సరసత సంజ్ఞగా వెల్లడిపరుస్తున్నాయి. ఇంతగొప్పగా ప్రకృతిన్నీ పురపరమున్నూ పరిఢవిల్లివున్న ఆ తావుకు నా దిక్కుగా ఎంచేతో ఆగట్టమ్మట ఎవ్వరున్నూ వస్తూవున్న జాడ కాపడలేదు. పోనీ గటుసన్నం అని అనుకొన్నా

ఓ మేకైనా రాకూడదూ ? ఓచీమైనా పోకూడదూ ? అనే ఆలోచనలో పడ్డాడు. ఎంతసేపని నీరవంలో పడివుండడం ?

" నావికుండని యన్న నాయకుండని యన్న దేవుడొక్కడేకదా ! "

అనే పదం ఏదో ప్రోత్సహించుకు పాడుకో సాగాను. ఒరిగే సూర్యబింబంకేసి చూపుసారిస్తూ సూర్యబింబం ఓనల్లని చిన్ని మేఘంచే అప్పుడే మరుగుపడుతూ ఆ మేఘంపై అంచుని వెండి కట్టు కడుతూవుంది. వెండికట్టు కడుతూ క్రిందికి తాపడుతూ నామాల్లా గీతలు ఎగచిమ్మింది. ఎగచిమ్ముతూ మేఘం దిగువాయిని ఎరుపుగమ్మింది. క్రమ్ముతూ ఆ ఎరుపువొంటికి పట్టించుకుంటూ భూమికి బరువైనట్టు దిగజారింది. దిగజారి దిగజారి అపరదిశ నంతర్ధానమైంది. అందాకా బింబంకేసి అలాచూస్తూనే వున్నాను ఏదో పరిభ్రాంతిగా. దిఙ్మండలాన్ని వదలకుండా మిగిలింది చిన్న మేఘం! దాని దిగువను ఎఱ్ఱడౌలు! మేఘాని కెగువల నారంజరంగు! ఆ రోజునకదే త్రిమూర్త్యాత్మకమోక్షం అన్నట్టు వీక్షిస్తూవున్నాను!—

మరేం జరుగదని—గరికపచ్చంచు లంకలనుంచివచ్చే అలల కలలు గంటూవున్నాను—

" మా అమ్మ రేవులోవుందో యింటికి వెళ్ళిందో " అని అడిగినట్టయింది నన్నెవరో! " ఎవరవు నీవు ? " అన్నాను. " నేను చాకలోళ్ల పిల్లను. ఈదాకా అడుపంపను పంపనని ఊగేగి యిప్పుడిప్పుడు సెలవిచ్చాడు పోయిరా! అని. బల్లమీద దెబ్బవినిపిస్తోంది, రేవులోనే వుండివుంటుంది ఇంకాను. కాస్త దారెట్టండి తంవరు అలా దిగిపోతాను " అంది. " ఎలా దిగిపోతావు ? అలా దారిలేదు. గొయ్యి గోదావరి " అన్నాను, " కొత్తగా తవ్వింరా ? వరద తెగ్గోసిందా ? " " నీకెందుకదంతా అలా తిరిగివెళ్ళు మీ అమ్మను చాకిరేవులోనే చూడాలని అనుకుంటే ఇది దారికాదు " అని కసిరాను. " ఎందుకండి అంత

కోపం. కోల చప్పుడౌతోంది. అదంతా తిరిగి పోనక్కరలేకుండా నావెక్కి పోతాను” అంటూ “ఓ నావా! నావమనిషి!” అని పెద్ద కేకవేసింది. “మీ అమ్మ కిల్లులేదూ? ఈచీకట్లో అమ్మా! అమ్మా! అని ఆ నావయెక్కి పోకపోతే మెరకదారినే పోయి కలుసుకోకూడదూ? మీ అమ్మను” అని ప్రబోధించాను.

“అమ్మా! అమ్మా!” అని అరచింది మళ్లీని. అవతల నుంచి ఎవరో “ఓసి నాతల్లీ! వచ్చావా? బుల్లయ్య నావమీదున్నాడు దాటిస్తాడు ఎక్కరా! ఎక్కరా!” అంటూ ఎవరో జవాబు ఇచ్చినట్టు అయింది. “ఎవరా బుల్లయ్య?” అన్నాను. “పడవబుల్లయ్య” అంది పిల్ల. “పడవ పల్లీకుదా? పైవేటుదా?” అని అడిగాను. “పల్లీకుదే! మా చాకళ్ళమట్టుకు” అని వూరుకుంది.

నీటివంచ కప్పుడే పోలీసు జవానొక్కడు ఎఱ్ఱటోపీతోవచ్చి నిలబడి “బుల్లయ్యో” పడవ నట్టేట్లోకితిస్తే మాటదక్కదు. దరికిజేర్చు అని హెచ్చరించాడు. బుల్లయ్య “ఏమండీ” అని అడిగాడు. పోలీసు అత్తోరి రేవు శేషాద్రిమెట్ట. తల్లి గొర్రేవు తాలూక్కచ్చేరి కట్టెదుట, దానికీ దీనికీ మధ్యను ఊరంత రోడ్డుంటే ఆ కుఱ్ఱది నీటిమీద వోడెక్కి పోవడానికి కారణం తెలుసుకోవాలి అన్నాడు.

పోలీసు గొంతు వింటూపిల్ల “ఈమూట మీకాడవుంచండి” అంది నాతో–‘ఏమ్మూట?’ అన్నాను. “చేపలు కావులెండి, కూడు కాదులెండి, భోగిపిడకలు” అంది అతి వొయ్యారంగా అక్కడ పెడుతూ. గట్టుదిగి అప్పుడే నావ ఎక్కింది. నా ప్రక్కనో యువకుడు చాకలి–దానిమగడే! గుండె లదిరించుకుంటూ పరుగెత్తుకొచ్చిన జాడనే కించిత్తయినా సేదదేరకుండా ఆమూట అమాంతంగావిప్పి “ఉత్తభోగి పిడకలు! సత్తుగిన్నెం చేసిందో?” అని గుప్పెడు పిడకలు నీటిలోకి విసిరాడు. బుల్లయ్యనావ అడ్డం తిరిగింది. మరో గుప్పెడు పిడకలు ఏటిలోకి విసిరాడు. అవలి

దెసనుంచి తల్లి చేతులెత్తి మొక్కింది. మూడోగుప్పిలెత్తి ఏట్లో విసరబోయేలో పోలీసన్న చుట్టివచ్చి ఫిర్యాదీనాపి "ఉత్తభోగి పిడకలంత్రా!" అంటూ ఆయువకుణ్ణి టెక్కుపోతూ నెట్టుకు పోయాడు.

నావమీద బుల్లయ్యా తాను నావికుడా? నాయకుడా? అన్నట్టు పిల్లకేసిచూస్తూ తెరచాప ఎత్తాడు ఓ అరమైలు. అరమైలు కాకపోతే పావుమైలు, పావుమైలు లేకుంటే పదిగజాలు.

పిడకలోతే పుడకలున్నాయి
పుడకలోతే తడికెలున్నాయి
తడికెలోతే తనువులున్నాయి
దానిపేరే భోగిమంటా లోనికూరిమి తెలియవే।

అంటూ పాడుకుంటూ చుక్కాని పట్టాడు. తానే లోక నావికుడులా తానే లోకనాయకుడిలా! పక్కావోఝాం! ఝాం కాకపోతే ఓఘుడియ! ఘుడియ లేకుంటే ఓ విఘుడియ!

... ... ... ... ...

## "అనుకోని లవ్! అనుకోని కిస్!"

(కథపేరు మహా కామోద్రేకంగా వుంది. కాని కడకంటా చదివితే తప్పకుండా కన్నీరుగారుస్తారు పాఠకులు!)

విద్యుత్తంతులు విలాసవనాలు విరివైన వీధులూ అన్నీ వున్నా అరవైనాలుఘ్ఘుళ్లా ఏపట్నం సందడించదు, ఏనగరం తేజరిల్లదు. రాత్రి రెండోఝాం మూడోఝాం మధ్యనో నిర్మానుష్య మనిపించే నిదరలో మునింగివుంటారు ప్రజలంచరూ. నింగికాంతి తప్ప మరో కాంతి ఇండ్లమీదగాని చెట్లమీదగాని గోడలమీదగాని గోదావరిమీదగాని కనబడదు. బహూ ప్రశాంతమనిపిస్తుంది. వ్రాసినంతలోనే యింత ప్రశాంతంగావుంటే అసలు ఆ తరుణంలో